

పేద విద్యార్థులకు గొడ్డలి పెట్టు

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడానికి పూనుకోవడం పేద విద్యార్థులకు గొడ్డలిపెట్టు వంటిదే. ప్రభుత్వ కళాశాలలను నమ్ముకుని ఎంతో మంది పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి ఆసక్తి చూపుతున్నారు. సీఎం చంద్రబాబు నిర్ణయంతో వైద్య విద్య భారంగా మారనుంది. పేద విద్యార్థుల ఆశలు అడియాలు కానున్నాయి.

– ఆర్‌సీ రజనీకాంత్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది, తాడిపత్రి



వైద్య విద్య కలలు చిదిమేయొద్దు

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పజెప్పడం వల్ల పేద విద్యార్థులకు తీవ్ర నష్టం కలగనుంది. ప్రధానంగా వైద్య విద్య కోసం రూ.కోట్లు వెచ్చించే పరిస్థితి ఉంటుంది. అంత ఖర్చు పేద విద్యార్థులు భరించలేరు. ప్రభుత్వం పేద విద్యార్థుల వైద్య విద్య కలలు చిదిమేయకుండా చూడాలి. ఈ విషయమై పునరాలోచించి మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలి.

– జూటూరు రఫీ, సీపీఐ మండల కార్యదర్శి, యాడికి



క్లుప్తంగా

జూడో పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో సీఐ, నిర్వాహకులు

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని రవితేజ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆర్డీటీ జోనల్ లెవెల్ జూడో లీగ్ పోటీలను అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ప్రారంభించారు. తాడిపత్రి, యాడికి, నర్సాపురం, గుత్తి పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల చిన్నారులు ఆసక్తి చూపాన్నారు. విద్యతో పాటు క్రీడలను సమానంగా చూసినపుడే భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో గన్నెవారిపల్లి సర్పంచ్ ఉమామహేశ్వర్, కోచ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



కాంస్య పతకం సాధించిన లోకేష్‌గౌడ్

తాడిపత్రి అర్బన్: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈనెల 10, 11, 12వ తేదీల్లో నిర్వహించిన సబ్ జూనియర్ జాతీయ తైక్వాండో పోటీల్లో తాడిపత్రికి ఎందిన కె.లోకేష్ గౌడ్ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అండర్–25 కేటగిరిలో పతకాన్ని సాధించిన అతడిని జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సాయిబాబా అభినందించారు. కార్యక్రమంలో లోకేష్ తల్లిదండ్రులు, కోచ్‌లు నరేష్, వెంకటరమణలు పాల్గొన్నారు.

కేజీబీవీకి సోలార్ ప్యానెళ్ల అందజేత



కేజీబీవీకి సోలార్ ప్యానెల్స్ అందిస్తున్న దృశ్యం

పుట్లూరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో ప్రవాస భారతీయ వాసవి సంఘం ఆధ్వర్యంలో భూమిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పుస్తక మిత్ర కార్యక్రమం కింద పుస్తకాలను పంపిణీ చేయడంతో పాటు, సోలార్ ప్యానెల్స్‌ను అందించారు. దాదాపు రూ.1.5లక్ష ల విలువ చేసే పుస్తకాలు, సోలార్ ప్యానెల్స్‌ను అందించిన ఆ సంఘం రీజనల్ డైరెక్టర్ కృష్ణవేణి శ్రీరామ్‌తో పాటు వెంకటక్రిష్ణ శ్రీరామ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మాధవి, భూమిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రామాంజులరెడ్డి, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక సేవతో సంతృప్తి



ల్యాబ్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: ట్రస్టు ద్వారా చేస్తున్న సామాజిక సేవ ఎంతో సంతృప్తినిస్తోందని ఫయాజ్‌బాషా ట్రస్టు చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఫయాజ్‌బాషా అన్నారు. తన ట్రస్టు ద్వారా పేదలకు ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ల్యాబ్ మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ల్యాబ్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. పేద ప్రజల సహాయార్థం సేవలు నిర్వహించేందుకు ఫయాజ్‌బాషా ట్రస్టు ఎప్పుడు ముందుంటుందన్నారు. ఇప్పటి వరకు ట్రస్టు ద్వారా చేసిన సేవలను ఆయన వివరించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పరివర్తన ఏకాదశి



పల్లకీ సేవ దృశ్యం

పామిడి: పట్టణంలోని తగ్గు దేవాలయంలో ఉన్న అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శనివారం పరివర్తన ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవతామూర్తులను పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం చేశారు. ఈసందర్భంగా భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

ఆగని తమ్ముళ్ల ఇసుక దందా

- శింగనమల, నార్పల, గార్లదిన్నె మండలాల్లో అక్రమంగా తరలిపోతున్న ఇసుక



శింగనమల పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన టిప్పర్‌తో పోలీసులు

శింగనమల: ప్రభుత్వం మాది, పట్టుకుంటే చిన్న కేసే కదా, ఏమవుతుంది, ఫైన్ వేస్తారు అంతేగా అంటున్నారు.. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు. కేసులు పెడుతున్నా, టిప్పర్లు, ట్రాక్టర్లను పట్టుకుంటున్నా ఇసుక అక్రమ రవాణా ఆపడం లేదు. శింగనమల మండలంలో పి.జలాలపురం సమీపంలోని వంకలో నుంచి అక్రమంగా పగలు ట్రాక్టర్ల ద్వారా ఇసుక డంప్‌కు తరలించి, అక్కడి నుంచి టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులకు చెందిన టిప్పర్లు, ట్రాక్టర్లు, జేసీబీ, ఇటాచీలను పలుమార్లు పోలీసులు పట్టుకున్నారు. వాటిపై కేసులు నమోదు చేసినా, మరుసటి రోజే వేరే వాహనాలు పెట్టి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. వీరి చేష్టలను ప్రజలతో పాటు, పోలీసులే విస్తుపోతున్నారు. తాజాగా శనివారం సీఐ కౌలుట్లయ్య ఒక ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నారు.

నియోజకవర్గంలో ఇసుక ఉన్న ప్రాంతాలు

శింగనమల మండలం పి.జలాలపురం వంక, పెరవలి కూతలేరు వంక, ఇరువెందల, సలకంచెరువు వద్ద నున్న వంక, పెన్నానది పరివాహక ప్రాంతమైన రాచేపల్లి, నిదనవాడ, తరిమెల, కల్లుమడి, బుక్కరాయసముద్రం మండలంలోని చెదల్ల, నీలాంపల్లి, గార్లదిన్నె మండలంలోని ఇల్లూరు, కల్లూరు, కొప్పలకొండ, మంటిమడుగు గ్రామాల సమీపంలోని పెన్నానది, పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని చిత్రావతి నదిలో ఇసుక వనరులున్నాయి.

ఇసుక తరలింపుపై సోషల్ మీడియాలో పోస్టులు

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక తరలింపుపై సోషల్ మీడియాలో ఆ పార్టీకి చెందిన వారే రోజూ పోస్టులు పెడుతున్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న పట్టించుకోలేదని ఆరోపణలు చేస్తున్నారు. ఈ విషయమై సీఐ కౌలుట్లయ్యను సాక్షి సంప్రదించగా ఇసుక అక్రమంగా రవాణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పలు టిప్పర్లు, జేసీబీలు, ఇటాచీలు , ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశామన్నారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

గార్లదిన్నె: మండలంలో పెన్నానది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సీఐ పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో పేకాట, మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఒక టిప్పర్, ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పామిడి: పట్టణంలని కొండూరురోడ్డులోని అంకాలమ్మ, కుంటిమ్మ ఆలయ సమీపాన పెన్నానది నుంచి అక్రమ ఇసుక తరలింపు ప్రాంతంపై శుక్రవారం అర్ధరాత్రి ప్రాంతంలో పామిడి పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఒక టిప్పర్, ఆరు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శనివారం తెలిపారు.



పామిడి పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ భాషా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, డాక్టర్ కృష్ణవేణి తదితరులు హిందీ భాష ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో హిందీ అధ్యాపకులు రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

బుక్కరాయసముద్రం: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివారెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో ఆయన మృతి చెందడం బాధాకరమన్నారు. మతోన్మాదంపై ఆయన రాజీలేని పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయ సాధనాల కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నారాయణస్వామి, శ్రీరాములు, రామక్రిష్ణ, లక్ష్మి నారాయణరెడ్డి, నాగేంద్ర, వెంకటేశ, విజయ్, నగేష్ తెలిపారు.

లోక్ అదాలత్‌లో 784 కేసుల పరిష్కారం



గుంతకల్లులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి మంజుల



తాడిపత్రి లోక్‌అదాలత్‌లో పాల్గొన్న ప్రిసిడింగ్ చైర్‌పర్సన్ నిర్మల



గుత్తిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ఏడీజే ఎం.శ్రీహరి

గుంతకల్లుటౌన్: స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి జి.మంజుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 784 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు అధికారులు తెలిపారు. జేసీజే కోర్టు–32 కేసులు, రైల్వే కోర్టు–618, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సంబంధించిన 128 కేసులు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు వెంకటేశ్వర్లు, తాజుద్దీన్, ఏపీపీ హేమలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూనస్ అహమ్మద్, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: కేసుల పరిష్కారానికి రాజీమార్గమే రాజమార్గమని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ బి.నిర్మల అన్నారు. శనివారం స్థానిక కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్ కాక్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ ప్రిసిడింగ్ చైర్మన్ బి.నిర్మల మాట్లాడుతూ కక్షిదారులు కోర్టులు, పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగూ సమయం, డబ్బు వృథా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలన్నారు. ఈసందర్భంగా 95 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో ఇరుపక్షాలకు చెందిన కక్షిదారులతో పాటు న్యాయవాదులు ఎన్వీ భాస్కర్‌రెడ్డి, హనీఫ్, సతీష్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

115 కేసుల పరిష్కారం

గుత్తి: పట్టణంలోని ఏడీజే, జూనియర్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ఏడీజే ఎం.శ్రీహరి ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 115 కేసులు పరిష్కరించారు. ఇందులో సివిల్ కేసులు 57, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు 16, రస్తా తగాదా కేసులు 10, ఐపీసీ 30, డొమెస్టిక్ వయలెన్స్ కేసు 1, ఎంసీ 1 చొప్పున మొత్తం 115 కేసులను పరిష్కారం చేశారు. బాధితులకు రూ.3.27 కోట్లు చెల్లించేలా తీర్పు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథాచారి, న్యాయవాదులు మహమ్మద్ రసూల్, కుమార్, ఓబులేసు, కుమార్, ఫక్రుద్దీన్, ధనుంజయ, ఎంవీ మహేష్‌కుమార్, రోజా రమణి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: తాడిపత్రి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోకాదలత్‌లో 36 కేసులు పరిష్కారమయ్యాయని ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. ఐపీసీ కింద నమోదైన 19 కేసులు, 17 పెట్టీ కేసులకు సంబంధించి నిందితులు రాజీ అయ్యారన్నారు. ప్రతి ఒక్కరూ శాంతియుత జీవనం గడపాలని ఆయన సూచించారు.

పౌష్టికాహారంతో రోగాలు దూరం

గుత్తి/పామిడి: పౌష్టికాహారంతో రక్త హీనత సమస్యలతో పాటు రోగాలు దూరమవుతాయని సీడీపీఓ ఢిల్లీశ్వరి అన్నారు. పట్టణంలోని స్టేట్ బ్యాంకు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పామిడి పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం –4లో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త భారతి, ఏఎన్‌ఎం వాణి, ఆయా, ఆశా కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.



గుత్తిలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

జాగ్రత్తలు తీసుకోండి

యాడికి: దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ వీధిలో ప్రజలకు మలేరియా, డెంగీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి సమయాల్లో తప్పనిసరిగా దోమ తెరలు వాడాలన్నారు. లేకపోతే వేపాకు పొగ వేసుకోవాలన్నారు. ఇంటి వద్ద డ్రమ్ములు, తొట్టెలలో నీటిని నిల్వ చేసుకోరాదన్నారు. అంతకుముందు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మార్కెట్ వీధిలో అవగాహన కల్పిస్తున్న తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు

బైకుకు నిప్పు



బైకును పరిశీలిస్తున్న ఎస్‌ఐ రాఘవేంద్రప్ప

గుంతకల్లు రూరల్: మండలంలోని ఇమాంపురం గ్రామంలో ఇంటి ముందు నిలిపి ఉంచిన బైకుకు శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. వివరాలు.. గ్రామానికి చెందిన రంగస్వామి శుక్రవారం రాత్రి తన ఇంటిముందు బైకును ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో మంటలు భారీగా వ్యాపించడంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చి కాలిపోతున్న బైకును గమనించారు. చుట్టుపక్కల వారి సాయంతో మంటలను ఆర్పినప్పటికీ బైకు అప్పటికే పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ రాఘవేంద్రప్ప వెంటనే గ్రామానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా స్త్రీల మైత్రి ఆరాధన

పామిడి: పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో శనివారం స్త్రీలమైత్రి ఆరాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీలను ఉద్దేశించి పాస్టరమ్మ సువర్ణమ్మ ప్రసంగించారు. అనంతరం బైబిల్‌లోని మరియ, ఎస్తేరు, హన్నా, రాహాబు వంటి తదితర మహిళా శిరోమణుల విశిష్టతతో పాటు స్త్రీల మైత్రి ప్రాముఖ్యతను ఆమె వివరించారు. కార్యక్రమంలో మహిళా సభ్యులు ప్రిస్కిల్లా, రేచెల్, ప్రశాంతి, మాణిక్యమ్మ, వాణి, మహిమ, రజని తదితరులు పాల్గొన్నారు.



సీఎస్‌ఐ చర్చిలో ఆరాధన కార్యక్రమ దృశ్యం

17న ఆల్బెండజోల్ పంపిణీ

యల్లనూరు: మండల వ్యాప్తంగా ఈనెల 17న జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి లోకేష్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు.

‘టిమ్’ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గసభ్యులను అభినందిస్తున్న ప్రభుత్వ ఖాజీ రజాక్‌పీర్ సాహెబ్

గుంతకల్లుటౌన్: టిప్పు సుల్తాన్ ఇత్తహాదుల్ ముస్లిమీన్ (టిమ్) పట్టణ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎండీ.ఖలీల్ తెలిపారు. శనివారం ఈద్గా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో పట్టణ ముస్లీంల ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ రజాక్‌పీర్‌సాహెబ్, అదనపు ఖాజీ సత్తార్‌సాబ్ పాల్గొని టిమ్ నిర్వహిస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలను అభినందించారు. అనంతరం టిమ్ పట్టణ నూతన కమిటీ అధ్యక్షుడిగా సిరాజ్, కార్యదర్శిగా ఇమ్రాన్, కోశాధికారి దాదాఖాన్, ఉపాధ్యక్షులుగా షంషుద్దీన్,బషీర్, గౌరవ అధ్యక్షుడిగా మస్తాన్ తదితర సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టిమ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.మౌలా తదితరులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛతా హీ సేవ’ జయప్రదం చేయండి

పామిడి: మండలంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 1 వరకూ నిర్వహించే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఈఓఆర్డీ బీవీ శశికళ కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో గ్రామాల్లో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేలా స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలతో ఎస్‌హెచ్‌జీ మహిళలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు.

పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నె ,యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు శనివారం ఓపీ వైద్యసేవలు బంద్ చేసి, అత్యవసర వైద్య సేవలు మాత్రమే నిర్వహిస్తూ నిరసన తెలిపారు. వైద్యులు మాట్లాడుతూ జీఓ 85 ప్రకారం తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందన్నారు. ఆదివారం విజయవాడలో ర్యాలీ చేస్తామని, సోమవారం జీవో 85 రద్దు చేసే వరకు నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు దిలీప్‌కకుమార్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల బండిని ఢీ కొన్న కారు.. రైతుకు గాయాలు

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో రైతు లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా.. జొన్నగిరికి చెందిన లక్ష్మణ్ ఎద్దుల బండిలో పొలానికి వెళ్తుండగా ఎదురుగా కారు ఢీ కొనింది. ఘటనలో లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కొరకు అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

గుత్తి: పట్టణంలో సీపీఐ నాయకులు శనివారం వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. సీపీఐ నాయకులు రమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.